


**'రచన'**లో మార్పులు చేసిన తరువాత ప్రతి నెలా అందంగా ముస్తాబయి 3,4,5 తేదీ కల్లా చేతికందుతున్నది. ఇది పాఠకులలో ఎనలేని విశ్వాసాన్ని కలుగచేసింది - అదీకాక, బహుమతి పుస్తకాలు సంచిక వెలువడ కుండానే పంపడమనేది కొత్త ఒరవడికి స్వీకారం చుట్టినట్లయింది. నాకు తెలిసి, ఏ పత్రికా ముందుగా బహుమతులు పంపుతున్నట్లు లేదు.

'రచన'లో సాహితీవైద్యం, కథాపీఠం శీర్షికలతో పాటు మంచి కథలు, గేయాలు, రావటము కూడా పత్రిక ప్రాచుర్యానికి బాటలు వేసింది. ఇలాగే 'రచన' వర్ధిల్లాలని ఆశిస్తూ...

**- పి.వి. రామారావు** (ఖమ్మం)

చందా పొడిగింపుకు సంబంధించిన మీ లేఖ అందినది. దానితోపాటు నెం. 105 సంచిక కూడా అందినది. ధన్యవాదములు. మావంతు మేము పత్రిక గురించి, పత్రికలోని కథల, శీర్షికల గురించి మా మిత్రులతో చెప్పటం జరుగుతుంటుంది. 'రచన' ఉన్నత స్థాయిలో ఎపుడూ ఉండాలని, ఇపుడున్నట్లుగా విలువల పరంగా 'రచన' పత్రికా ప్రపంచంలో రారాజుగా ఎపుడూ వెలగాలని ఆకాంక్షిస్తూ పొడిగింపు చందా పంపుచున్నాను.

**- ఆర్.వి.యస్. యస్. శ్రీనివాస్** (జగదల్‌పూర్)

జనవరి 2002 'రచన' సంచికలో 1949 నాటి 'కాకతీయ' పత్రికలో ప్రచురింపబడిన పి.వి. నరసింహారావుగారి 'రామవ్వ' కథను అందించిన సంపాదకులకు కృతజ్ఞతలు. యాభై ఏళ్ళ కింది కథ. సంభాషణలు నూరు పాళ్ళ తెలంగాణ మాండలికాన్ని పుణికిపుచ్చుకొని సహజంగా ఉన్నాయి. పి.వి. ఇంత మంచి కథకులా! భాషపై పట్టు ఉండి, సామాజిక నేపథ్యం ఉండి, ప్రయోజనం అందించే చక్కటి కథను ప్రచురించిన 'రచన'కు మరియు రాజనీతిజ్ఞులు, సాహితీ కృషీవలురు పి.వి.కి అభినందనలు.

**- సబ్బిని లక్ష్మీనారాయణ** (కరీంనగర్)

మీరు రాసిన 'సంపాదకీయం'లో రైతు రచయిత (పేరా 3) గురించి ప్రస్తావించారు. ఆ ఉత్తరం చూసి మనసంతా ద్రవించి పోయింది. నాకు అర్థమైంది, చందా వచ్చినా మానినా, మీరు యోగ్యులైన పాఠకులకు పత్రిక పంపుతున్నారని. ఇది చాలా గొప్ప సంగతి. ఎక్కువ రాస్తే పొగడ్త అవుతుందని భయం. నేను చెప్పదలచుకున్నదేమంటే, ఆయనకి (వి. నిరంజన్-చెర్లోపాలెం) 'రచన' తప్పక పంపుతూండండి. ఆయన దగ్గర నుంచి చందా రాకపోతే నాకు తెలియబరిస్తే - ఆ చందా నేను పంపుతాను.

**- బిఎస్కే. సోమయాజులు** (హైదరాబాద్)

'రచన' చదవడం మా సాహిత్యాభిరుచికి దర్పణం. పాఠక మనోభావ వేదిక 'రచన'. ఎక్కడా ఏ విషయంలో రాజీ ధోరణి లేకుండా ఉత్తమ సాహిత్యాన్ని అందిస్తూ తులసి మొక్కలా పరమ పవిత్రంగా సరస్వతీ మానసికోల్లాసానికి ఆవిర్భవించిన 'రచన' చదవని పాఠకుడు పాఠకుడే కాడన్నది నిర్వివాదాంశం! అటువంటి మా 'రచన'కి నూతన సంవత్సర (2002) శుభాకాంక్షలు హృదయపూర్వకంగా తెలుపుతున్నాము.

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు,**
**పి.వి.సుజాతారాయుడు** (సికింద్రాబాద్)

ప్రత్యేక సంచికగా జనవరి 'రచన' వస్తుందని ఎదురుచూసేను. విశేష సంచిక కూడ ప్రత్యేక సంచిక లాగానే అమూల్యంగా ఉంది. ఏదైనా సకాలంలో వచ్చి పత్రిక పాఠకుల ఆదరానికి పాత్రమవుతున్నది.




శ్రీలక్ష్మి : కౌరవుల తర్వాత నేను పుట్టి వుండి వుంటే చాలా బాగుండేది.

పద్మ : ఏం?

శ్రీలక్ష్మి : ఎంచక్కా 100మంది అన్నల పెళ్ళిళ్ళకి 100 ఆడపడుచు కట్నాలు వచ్చేవి కదా.

**- చలపాక ప్రకాష్** (విజయవాడ)

జనవరి 'రచన'లోని కథలలో వాడ్రేవు పతంజలి గారి స్మారక కథలు అన్నీ బాగున్నాయి. 'మన వరాలు మనవరాలు', 'మచ్చిక', 'క్రీనీడ క్రీడలు' కథలు ఇల్లా జరిగితే బాగుండును అని మా మనసులో అనిపించినట్లే వుండడము వలన బాగున్నాయి.

'కథాప్రహేళిక' కథ అయిన 'పండుగ' కథ చప్పగా ఉంది. 'సమ్‌క్రాంతి' పాత కథే అనిపించింది.

'రామవ్వ' కథలో 'పన్నా' కథ ఛాయలున్నా మాండలిక భాషతో, సహజ సంభాషణలతో 'ఎంత బాగుంది!' అనిపించింది. పన్నా కథలో వయోవృద్ధుడయిన కర్మిష్టి బ్రాహ్మణుడు రాజకుమారుని దాచడానికి తన విస్తరిలో అన్నము తినిపించి 'మా మనవడు' అని చెప్పడం గుర్తుకి వచ్చింది.'ఓ బుద్ధిమంతుడి కథ', 'సంగీత' కథన విధానం వల్ల 'ఆహా!' అనిపించేయి. 'నా వాదం' కవిత చాలా బాగుంది. భావానికి సమగ్ర చిత్రణ జరిగింది. రచయితలందరికీ వందనాలు. సంపాదకులకు అభివందనాలు.

**- కే.వేం. విజయలక్ష్మి** (మహాడ్)

'రచన' మళ్ళీ 20 రూపాయల విలువకెదిగి - బరువుగా - ఉండగలగడం ఉత్సాహభరితులను చేసింది. అందమైన ముఖచిత్రాలను - అన్ని పత్రికలకన్నా భిన్నంగా మలచగలగడం మీ కళాదృష్టికి నిదర్శనం. కథల వేదికగా, కవితల వాహికగా - 'రచన'ను ప్రతినెలా తీర్చిదిద్దగలుగుతున్న మీ నేర్పు, ఓర్పు ప్రశంసార్హం సుమా! వ్యంగ భావస్ఫోరకంగా చిత్రాలను మలచగలుగుతున్నారు. అదొక రిలీఫ్ - రొటీన్ కాప్షన్స్‌తో, రొటేటరీ బొమ్మలతో విసిగి వేసారు తున్న మాకు 'రచన' కార్టూన్స్ నిజంగా రిలీఫ్. మెచ్చిన కథలెన్నో ఉన్నా అభిప్రాయ ప్రకటన అవకాశం ఒక కథకే ఉన్నది గనుక దాన్ని గూర్చి మాత్రమే ప్రస్తావించ వలసి రావడం ఒకింత ఇబ్బందిగలిగించినా - ఇష్టా పూర్వకమే గనుక సర్దుకుపోతాంలెండి.

అనువాద కథలు కూడా పఠనయోగ్యమైనవే ఎంచుకోవడం బాగుంది.

ఏదైనా మీ కృషికి సరైన ప్రోత్సాహం - బకాయా పడ్డ చందాదారుల నుండి రెన్యూ చేసుకోగల - మంచితనమే - వారి సౌహార్దాన్నీ, సౌమనస్యాన్ని మీ వైపు ప్రసరించేలా ప్రార్థిస్తూ...

**-రావెల పురుషోత్తమరావు** (హైదరాబాద్)